శ్రీ పి. యస్. శాస్త్రి

# "పెరుగుట విరుగుట కొరకే"

(చైతన్య స్రవంతిలో రచన)

హాహహ!... హుహుహు! అబ్బా చలి! అమ్మో చలి! ఏం చెయ్య నేం చెయ్య నేంచెయ్యను! లాభంలేదు. లాభంలేదు...లేదులా... కాదులా!...ఏదికాదు ఏదిలేదు?...ఉహ్హాహ్హా...చలి!...భంభం... చలి...భంభం...లాలా...లే లే...దుదు!...చలి...

..."కమాన్ గెటప్ రామ్రావ్!" "ఛప్!షటప్!మై డియర్ అంతర్ ఆత్మా! అంతర్‌జంతర్‌మంతర్...ఆత్మా...పరమాత్మా... ప్రత్యగాత్మా... ఆత్మారావ్... నీకు బుద్ధుందా? చలికాలం ఉద యాన్నే వొంటరిగాణ్ణి లేపచ్చా? నేను చచ్చినా లేవను!".

...అదేమిటి అదేమిటి? ఛస్తే లేవడమెలాగా?

...ఛీ ఛీ !...ప్రొద్దున్నే దుశ్శకునపు...దుశ్శకునమా అప శకునమా? దుర్ ప్లస్ శకునం దుశ్శకునం అనగా చెడ్డ శకునం... అలాగే మరో మాట లాగేద్దాం!...దుర్ ప్లస్ శాలువా...దుశ్శాలువ అనగా చెడ్డ శాలువా!...

...హోల్డాన్ హోల్డాన్! దేర్ యీజ్ యె స్లైట్ హిచ్! దుశ్శాలువలు గౌరవ పురస్సరంగా యిచ్చేవి! చెడ్డవైతే ఎందు కిస్తారు? ... దుశ్శాలువకు అమరంలో నిర్వచనం యేముందో చూడాలి!...అంతవరకు మన పరిశోధనని కట్టిపెడదాం!

...అబ్బాచలి!...అబ్బబ్బాచలి!..."లేవయ్యా రామారావూ!"... "అబ్బబ్బా! నీ గొడవేమిటోయ్ ఆత్మా! నేనిందాకా చెప్పానా? నే నిప్పుడు చచ్చినా లేవను!" నేనిలాగే యుగాలూ జగాలూ గడ చినా..."అదీ భలే పడుతోందియమకం!...కం కం...కమ్‌కమ్‌కమ్! కమాన్ డియర్..." కం కం కం కంగారు నీకేలనే ... నావంక రావేలనే..."లేస్తావా రావూ?" ..."అబ్బా లేస్తున్నా ఆత్మా!"...

... ముఖం కడుక్కోగానే కనిపించిన ఆ అప్సరస ఎవరెవ రెవరు?..."ఎవరివో నీవెవరివో ఎవరివో..."ఎవరెవరు? ఇంకెవరు? మై డియర్ డ్రీంగర్ల్ హేమమాలిని...డ్రీంగర్ల్...స్వప్నసుందరి... అలనాటి అంజలీదేవి...ఈనాటి నాట్యతార స్వప్నసుందరి... సుందరి సుందరి..."ఓహో సుందరీ ఆహా సుందరీ"...

...అవునవును! ఆమె స్వప్నబాల హేమమాలిని ఆ వొంపు సొంపులు...గ్రాండ్‌వొంపులు...కెంపులు పోసినా కాని దొరకని వొంపులు... మై డియర్ శారదా రమణీ...మణీ! ఈ చలిదినాలలో నీ భర్త నొదిలి పుట్టింటికేగ నీకు న్యాయమా?... "న్యాయమా నామనో నాయకీ?"...ఒహో భలే వచ్చింది...ఒంటివేడి బుర్ర కెక్కుతోంది...ఏం చెయ్యనేం చెయ్యను?...

..."మసకమసక చీకటిలో...మల్లెతోట వెనకాల...మాప టేల కలుసుకో నీ మనసైన"......అహో!ఓహో!..."ఈ భంగిమ నచ్చిందా?"...నచ్చదూ నచ్చదూ? ఎందుకు నచ్చదు? కాంచన వండ్రఫుల్! భంగిమ! భంగిమ...రంగైన బంగారు బొమ్మభంగిమ!

"ఒస్తా!వెళ్ళొస్తా! మళ్ళెప్పుడొస్తా?రేపు సందేళకొస్తా"... ఒహో శారదామణీ నువ్వు రావు రావు రావు! "నువ్వు రామారావు!"

"అవునయ్యా! నేను రామారావునే! రావు గోపాలరావు నేం కాదు! మధ్యలో నీ నస ఏమిటంట!" "శారదామణీ! నీ మొగుడి గాడి బాధ నీకేం తెలుస్తుంది?...అబ్బా చలి! ఒంటికి చలి... ఒంట్లో చలి! ఊపేస్తోంది మనస్సును!... వొణికిస్తోంది నర నరాన్ని...మనసు వానరంలా గంతులు వేస్తోంది!" ఒరేయ్ రామా రావ్! ఏమన్నా వెధవ వేషాలేస్తే మళ్ళీ రంగనాయకమ్మగారు పెళ్ళాలు ఊళ్ళోలేని మగాళ్ళగురించి మరో కథ రాసేస్తుంది జాగర్త!" "...అబ్బే అబ్బే!... ఏం లేదేం లేదు! అటువంటిదేం లేదు!"

..."నీవు లేక వీణ పలుకలేనన్నది. నీవురాక రాధ నిలువలే నన్నదీ"......"నీవు లేక నేనూ నిలవలేక వున్నానూ... నీవు రాక నన్ను చంపుతూవున్నావూ!"...ఓహో! మనమూ పాటలురాయగలం సందేహం లేదు! వెధవది! ఒట్టిపాటలేమిటి ? పాటలు, మాటలు, ఫొటోగ్రఫీ, దర్శకత్వం, కళాదర్శకత్వం, సంగీతదర్శకత్వం...అన్నీ మనం చెయ్యగలం!..."రామారావ్! కోతల జోరు తగ్గించు! అన్నీ నువ్వే చేస్తే చివరలో (భానుమతి వోసారి చెప్పినట్టు!) సినిమాను చూసుకోవడం కూడా నీవొక్కడివే చేయాలి!

..."అబ్బా ఆత్మా!... ప్రోత్సాహమిచ్చి ముందుకి నడిపించ వలసిందిపోయి అస్తమానం నువ్విలా వెనక్కి దిగలాగితే నేను ముందుకువెళ్ళేదిఎలాగాలని?"...'అంతరాత్మ'మాటలుఅప్పుడప్పుడు విన్నవాళ్ళు మాత్రమే బాగుపడతారట! కనక యీసారికి ఆత్మకి 'నో' చెబ్దాం! మన కలల లోకంలోకి వెళ్ళిపోదాం!...జల్దీ ఛలో!... ఆ!...అన్ని దర్శకత్వాలు నెరుపుదాం!...అది సరే కాని ఆ ఫీల్డు లోకి వెళ్ళడానికి వెనకటికి దుర్యోధనుడు చెప్పినట్టు...అవును 'దుర్యోధనుడు' అంటే చెడ్డగా యుద్ధం చేసేవాడనేనా? మరి

ఋూ దుర్యోధనుడికే 'సుయోధనుడు' అని కూడా పేరున్నట్టుందే! ఏమిటో ఋూ గందరగోళం అంతా! "సంస్కృతం చదువుకోక పోవడంతో మా చిక్కొచ్చి పడింది"!... ఇది గిరీశం డైలాగుల ఫక్కీకాదూ?... కాదేమిటి మక్కికి మక్కీ!...ఆ యింతకీ ఆ దుర్, సు,యోధనుడు చెప్పినట్టు సూదిమోపినంతస్థలంకూడా యివ్వటం లేదు ఫీల్డులో వాళ్ళు!...ఆ మాత్రం అవకాశం యిస్తేనా...ఒక వూపు వూపనూ?..." ఒరేయ్ రామారావ్! ఇప్పుడు ఫీల్డులో వున్న వాళ్ళు వొకప్పుడు నీలాగే అనుకుని వుంటారు! అక్కడికి వెళ్ళాక ఆ గాడిలో యిరుక్కుపోయి వుంటారు".

..."అబ్బా ఆత్మా! నా కాంక్షాజ్వాలపై నీరు చిలకరించెద వేలా?"...మన ప్రజ్ఞాప్రాభవాలిలా మాసిపోవలసిందే...ఏ ఇరవై లక్షల లాటరీయో తగిలి మనమే సినిమా తీసేవరకూ అవకాశం లేదు!..."లాకేత్వము దాకు కొమ్ము"...అంతే!

...అమ్మా టిఫిన్ కాఫీ పూర్తయింది! పాన్ షాప్‌లో కాదు తెలుగు దేశపు రాజధానిలో ఉండి తెలుగులో మాట్లాడకపోతే ఎలా? 'కిళ్ళీ బడ్డీ'లో...'కిళ్ళీ' తెలుగుమాటేనా? శబ్దరత్నాకరం చూడాలి! సీతారామాచార్యులవారి కాలం నాటికి 'కిళ్ళీ' ప్రాచుర్యంలో వుందో లేదో! లేకపోతే ఋామధ్య నిడదవోలు వెంకటరావుగారి అనుబంధంతో ప్రచురించారుగా సి. యల్. యస్. వాళ్ళు శ. ర.వి. అందులో వుండదా? సాయంకాలం వెళ్ళగానే చూ. శ. ర....

...ఇంతకీ 'పాన్ షాప్' అదే 'కిళ్ళీ బడ్డీ'లో వక్కపొడి కొనా లనుకున్నాం గదా...ఒక పాకెట్...ఏది? అదే "ఒక్క త్రివేణి వక్క పొడి పెద్ద పాకెట్ యివ్వండి... ఏక్ త్రివేణీ సుపారీ దేవ్!" "అబ్బ! త్రివేణీ వక్కపొడికింత డిమాండా?"... "అహ్హాహ్హా మరే మనుకున్నావ్!" వివిధ భారతిలో ప్రకటన! అడ్వర్‌టయిజ్‌మెంట్... శ్రోతల బుర్రల్లోకి ఆదేశాల్నితిన్నగాయెక్కించే సాధనం! సాధనం... ధనం సంపాదించడానికి! అడ్వర్‌టయిజ్‌మెంట్ ద్వారానూ, అడ్వర్ టయిజ్ చెయ్యడానికీను! ఒహో! "ఎటుచూసిన చటులాలంకారపు మటుమాయలలో"... "కవితా—...నా కవితా!"...

"హలో రావ్! ఏం చేస్తున్నావ్? ఏవీ చెయ్యటంలేదా? సరే! "ఎంటర్ ది డ్రాగన్" మార్నింగ్ షోకు వెడదామా ?!... "రావూ?...రావు! నువ్వెందుకొస్తావ్! రాణీ యింటికి వెడతావ్! నువ్వు "రావు"...నువ్వు రావు!"

...వెధవ వెధవవ్వెధవ! వెధవన్నర...అరవెధవ పావువెధవ... చికిలి కళ్ళతో కులికే రాణి యింటికి సెలవురోజు ప్రొద్దున్నే తయారు! ఆఫీసులో రోజంతా చెప్పిన కబుర్లు చాలలేదు! ప్రొద్దుటి నుంచి సాయంత్రందాకా పొగడటం చాలలేదు! ..."ఏం చేస్తాడు!" "తా వలచింది రంభ తా మునిగింది గంగ!" ... కాని మనకు ఆ సంభాషణావకాశమూలేదే!...అవకాశం .. సావకాశం...ఆకాశం ... కాశం...శంకా నహి నహి రక్షతిరే శంకా...నహీ నహీ! నహీ!... పోనీ మనమే పోదాం సినిమాకు...

... "గుడ్మార్నింగ్ సార్! మార్నింగ్‌షోకని బయలుదేరా! ... అబ్బే పెద్ద "షోకేం" లేదండి. మామూలుగానే ఉన్నా! షో లేకా? పదోసారి పోలేదండి! ... అహ్హాహ్హా! మీరు రమ్మంటే రానా ?" ... కొంపదీసి ముసలి ముండాకొడుకు, కూడా రమ్మనడు గదా ? వాడు పట్టించే జిడ్డు కుక్క సబ్బెట్టి తోమినా వదలదు!"

... అమ్మయ్యా! పీడా పోయింది ... ఆడగాలి సోకితేచాలు గురుడు మరి అటు యిటూ చూడడు ... ముక్కుకు ఎవరో తాడు వేసి లాగినట్టే! ... వెధవ! మళ్ళీ మారు పలక్కుండా వెళ్ళి పోయాడు ...

... ఓరీ రామారావూ! నీకు మాత్రం ఆడగాలి యిప్పుడు ఇష్టం లేదూ ? కదిలే చీరల రెప రెపలను కళ్ళు చించుకు చూస్తావేం ?" ...

..."నాకా...నాకా? ఛ! అదేం లేదు! ఆ చీరల డిజైన్లు చూస్తున్నా!"

... "ఏడిశావ్ నీ సంగతంతా నేను కనిపెడుతున్నా! ఆ చీరల డిజైన్లుబదులు కొంగుజారడాన్ని ఆతృతతో గమనిస్తున్నావు! ఒరేయ్! నేను నీ అంతరాత్మని— నన్నే మోసం చేద్దామని ప్రయ త్నిస్తున్నావురా డింగరీ? వాడు కాదు. నువ్వు వెధవ్వి! పెళ్ళాం యింట్లో లేకపోయేసరికి రోడ్డున పడ్డావు! " ... మనిషి రోడ్డున ..."

"షటప్! అంతరాత్మఎంటూ గౌరవించి వొకసారి కాకపోతే మరోసారేనా నువ్వు చెప్పినట్లు వింటూవుంటే నీకు వొళ్ళుకొవ్వెక్కి పోయి నామీదే అభాండాలు వేస్తున్నావు! ..."

"హహహ! ఓరీ రామారావూ నాకు వొళ్ళులేదురా! నిరా కారుణ్ణి! నీ దేహాన్ని ఆధారం చేసుకున్నా! ... ఆ నీ వొళ్ళే కొవ్వెక్కింది!" ...

"హా! కనిపించను కదా అని కండ కావరం పెరిగింది నీకు!"

"హహహ! ఇందాక ఓసారి చెప్పా! కండేలేదు నాకు! కావరం ఎక్కడిదిరా ? అదంతా నీదే! ..."

"అబ్బబ్బా! ఆత్మా! షటప్ అండ్ గెటౌట్ ఫస్ట్! లేని పోని వూహలు నా కంటగట్టి, నూరిపోసి, "బ్రెయిన్ వాష్" చేసి నన్ను దుర్మార్గుడిగా మార్చేద్దామని చూస్తున్నావు! నీ ఆటలింక సాగనివ్వను? గెటౌట్. వెళ్ళు! వెళ్ళి ఆ హృదయ కుహరంమధ్యలో "నీ లతో యద మధ్యస్థ విద్యుల్లేఖేవ భాస్వరా"...లా తల్లక్రిందు లుగా పడుకో! ఫో ... ఫో ముందు!

... "ఫూల్! నన్నే డబాయించగలననుకున్నాడు! దెబ్బకి దెయ్యం జడుస్తుంది! దైవాంశ సంభూతుణ్ణి అని చెప్పకునే వీడెంత ? ... దెబ్బకిపోయి పడుకున్నాడు. మన అంతరాత్మ నోరే మనం మూయించ లేకపోతే ఎలాసార్!"...

... అయినా మనస్సు చంచలం ... చలం ... అరుణాచలం లోకి కరుణా చలం ... చలం ... కళాప్రపూర్ణ చలం ... కవిగా చలం ... రవిగా చలం ... ఎన్నో వేల హృదయాలలో చలనం కలిగించిన చలం ... చంచలమైన ... చం చ లా ... మైడియర్ చంచలా! ఎక్కడున్నావ్? ... ఆ...మనస్సు చంచలమని షణ్మత స్థాపకాచార్య జగద్గురు శ్రీ ఆది శంకరాచార్యులవారినుంచి యీనాటి సూక్తి ముక్తావళీ ఆచార్యుల వరకూ ... సూక్తిముక్తావళి చెప్ప డానికి డాక్టరేట్ ఆచార్యులు, పౌరాణిక ఆచార్యులు అని రెండు కేట గిరీలుట! ... వివి గిరి గారేం చేస్తున్నారో?...ఆ ... అందరూ చెప్పారు. అందుకని ఆత్మగాణ్ణి బుకాయించినా, అందులో యే కొంతో నిజముందో నేమోనని చిన్న అనుమానం!...హుం! మనకేం ఫరవాలేదు! మనకెంతో ఆత్మబలం, మరెంతో ఆత్మనిగ్రహం ఉన్నాయి! 'ఆత్మ నిగ్రహం' అంటే ఆత్మని నిగ్రహించడమా? ... ఛ కాదు ... మనని మనం అదుపులో పెట్టుకోగలగడం అను కుంటా. అబ్బ శాంస్క్రిట్ రాకపోవడం పెద్ద డ్రా బాక్ అయింది!

"పోనీ ఉదయాన్నే రేడియోలో సంస్కృత పరిచయం విని నేర్చుకోరాదూ?" ...

"ఓయ్ ఆత్మా! నిన్నిన్ని తిట్టినా నన్నొదల లేదా?"

"ఎందుకొదులుతాను? నీ శరీరం ఉన్నంతసేపూ నీలోనే, నీతోనే వుంటా ... నీడలా, తోడులా!"

... ఔరా! ఈ ఆత్మకి తెలుగు సినిమాలు చూసి చూసి యమకం చమక్కులు సినీ డైలాగులు నర నరాన్నా జీర్ణించి పోయాయి! ...

"అదే కాదురోయ్ రామారావ్! నీవీ మధ్య వచన కవిత్వం వెలిగించాలని ప్రయత్నించటంలేదూ? అది నాకు మాత్రం రాదను కున్నావేమిటి!"

"సరే సరె సరే! కాసేపు నోరుమూసుకో! నా ఆలోచనలు నో దారిలో సాగనివ్వక అడ్డం తగులుతావేం!"

ఆ! మనస్సు చంచలం. అది దాని సహజ స్వభావమట. విద్యారణ్యులవారు కూడా చెప్పారు. దాని సహజ స్వభావాన్ని నేను మార్చగలనా? రోడ్డుమీద నడుస్తూ కాస్త అటు యిటూ చూసి వుండచ్చు. పెళ్ళాం యింట్లో లేనివాడికి కాస్త కంటి మెరమెర వుండచ్చు!

"అదే! అదే! అదేరా రామా, నేనన్నదీను! కాదని నన్ను డబాయించావు! నా నోరు మూయగలవేమోకాని నీ మానసలోకం నోరు ముయ్యలేవు!

"ఛవ్! ఒద్దన్నకొద్దీ వెంటబడి వేధిస్తావేం! పో లోపలికి పోయి పడుకో మదీయ ఆత్మరాజమా!" ...

"తప్పకుంటాలేవయ్యా బాబూ! ఆ బొమ్మనిచూసి నేనేం మైమరచిపోవటంలేదు!" ..."మై" అంటే 'మెయి' అంటే శరీరం అయి వుంటుంది. అంటే శరీరం మరచిపోవటం అన్న మాట—అంతేనా?...

అబ్బ! కళ్ళు చెదరగొట్టే సెక్సీ బొమ్మలు...లంగాలతో, లుంగీలతో, స్లీవ్‌లెస్‌లతో, టాప్‌లెస్‌లతో...అమ్మాయిల అంద చందాలు...సినిమాల్లో వుజ్జ్వలంగా, బొమ్మల్లో ఆకర్షణీయంగా... అబ్బా వెన్నులో జలదరింపు, ఒంట్లో చలి ప్రారంభమవుతున్నాయి. ఆ రోడ్డుమూల పందిట్లో రికార్డుల..."ఎక్కుమామా బండెక్కు మామా"..."కొట్టుమామాపంపు కొట్టుమామా"..."ఎందుకంటే ఏమి చెప్పను...ఏమిటంటే ఎలా చెప్పను?" చెప్పను చెప్పను... "అందుకే"..."అందుకే"...ఇంకెందుకు? అబ్బా వళ్ళు వేడెక్కి, వేడెక్కి, నరాలు పోటెట్టి, ఎక్కి...ఎక్కి...

"ఎక్కు ఎక్కుసిటీబస్సెక్కు!"...సిటీ...టీబస్సు...టీ టీ టాటా టూ టూ...నిలబడి కాళ్ళు తొక్కుకుంటూ, కుదుపులకు అటు యిటూ వొరిగిపడుతూ ... విసుక్కుంటూ ... నీలుక్కుంటూ కుంటూ...ప్రయాణం...ఆడామగా బేధంలేదు... లేదు లేదులే ...

అబ్బా! హాయి! నాముందు నన్ను హత్తుకుని, నావొంటికి మెత్తగా వొత్తుకుని తగిలే ఇసుక తిన్నెల్లాంటి మెత్తని శరీరపు కండలు...నా శరీరపు వేడిని పెంచుతూ...నా నరాన్నివొణికిస్తూ, నా రక్తపుపోటు పెంచుతూ...అబ్బా...యీ ఆడవాళ్ళు! ... "ఇటీజ్ వుమన్ దట్ సెడ్యూస్ ఆల్ మేన్ కైండ్!" ... ఆమె ముందుకు జరగదేం...కొంపదీసి నాలాగే ఆమెకీ? నిజంగానేనా...ఇంకొంచెం దగ్గరకు జరిగిచూద్దాం...సంగతి తేలిపోతుంది! దగ్గరికి...ఇంకొంచెం ...ఇంకొంచెం...ఏమీ అనటంలేదు...అంటేపరపురుష స్పర్శ ఆమెకీ? అంతే అయివుంటుంది. ఎవరూ గమనించటంలేదు! "ఎవరూ చూడటంలేదు, క్షితిజరేఖ వెనుక నిలిచి పిలిచే రత్నకంకణ హస్తాన్ని".

ఓ చెయ్యి బుజంమీదకు మెల్లిగావొదిలిచూద్దాం! 'స్లో'గా... 'స్లో'గా 'లో'గా అబ్బ! జర్రున జారే ఆ నును ...ఆ గుండ్రదనం... ఆ మెత్తని కండక్రిందకు... "ధైర్యే సాహసే" కానీ...కానీ... మెల్లగా.. మెల్లిగా బుజంమీంచి...

"ఫూల్! ఇడియట్! ఇందాకటినుంచి చూస్తున్నా! వెధ వ్వేషా లేస్తావ్! పోలీసుల కప్పజెబుతా! ఏమనుకున్నావో! రాస్కెల్!"

అబ్బ! దవడ పేలిపోయింది! కళ్ళముందు మెరుపులు మెరి సాయి! దవడమీద పిడుగులు కురిసాయి! భలే అయింది! వెధవలా మొహం దించుకుని క్రిందకి దిగిపోయా! బాగా అయింది. కావల సిందే! సుమతీ శతకంలో చెప్పలేదూ? "పెరుగుట విరుగుట కొరకే" అని! ఒచ్చిం దొచ్చింది! బుద్ధొచ్చింది! శారదామణి వచ్చే వరకూ మళ్ళీ యిల్లు కదలను! మణీ...అబ్బా! ఈ పన్ను కదులు తోంది... ఊడిపోతుందేమో!...